ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
సోమవారం 10 మార్చి 2025



నేడు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

పార్వతీపురం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసిన నేపథ్యంలో ఇకపై ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అన్ని మండల కేంద్రాల్లోని ప్రభుత్వ కార్యాలయాల్లోనూ ఈ కార్యక్రమం జరగనుందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని జిల్లా ప్రజలు గమనించాలన్నారు. అర్జీదారులు తమ దగ్గరలో ఉన్న మండల కేంద్రాల్లో లేదా జిల్లా ప్రధాన కేంద్రంలో నిర్వహించే పీజీఆర్ఎస్‌కు హాజరై వినతులను అందించొచ్చని వెల్లడించారు.



పాలకొండలో భారీ ఎల్ఈడీ స్క్రీన్‌పై మ్యాచ్‌ను తిలకిస్తున్న ప్రజలు





దత్తివలసలో సెల్‌ఫోన్‌లో మ్యాచ్‌ను వీక్షిస్తున్న యువకులు

క్రికెట్ జోష్

- టీమిండియాదే చాంపియన్స్ ట్రోఫీ
- న్యూజిలాండ్‌పై ఘన విజయం
- భారీ స్క్రీన్‌లు, టీవీలు, ఫోన్లలో మ్యాచ్‌ను తిలకించిన ప్రజలు
- బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్న అభిమానులు

పార్వతీపురం టౌన్/పాలకొండ/గరుగుబిల్లి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌లో ఆదివారం భారత జట్టు విజయం సాధించడంతో జిల్లావాసులు సంబరాలు చేసుకున్నారు. బాణ సంచా కాల్చి సందడి చేశారు. తొలుత బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ 50 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 251 పరుగులు చేసింది. అనంతరం భారత్ జట్టు బ్యాటింగ్‌కు దిగగా అభిమానులు ఉత్సాహంతో వీక్షించారు. భారీ స్క్రీన్‌లు, టీవీలు, సెల్‌ఫోన్లలో మ్యాచ్‌ను తిలకించారు. భారత్ నిర్ణీత 49 ఓవర్లలో నాలుగు వికెట్ల తేడాతో 252 పరుగుల లక్ష్యాన్ని ఆరు బంతులు మిగిలుండగానే ఛేదించింది. వరుసగా మూడోసారి టీమిండియా చాంపియన్స్ ట్రోఫీ గెలవడంతో జిల్లాలో క్రికెట్ అభిమానుల ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. వాస్తవంగా జిల్లావాసులు భారత్- న్యూజిలాండ్ జట్ల మధ్య జరిగిన క్రికెట్ చాంపియన్ ట్రోఫీ ఫైనల్‌ను మధ్యాహ్నం నుంచి ఉత్కంఠగా తిలకించారు. డివిజన్ కేంద్రం పాలకొండ జట్టివారివీధిలో ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. స్థానికులతో పాటు యువత, చిన్నారులు కేరింతలు కొడుతూ మ్యాచ్‌ను వీక్షించారు. గరుగుబిల్లి మండలంలోనూ పలు గ్రామాల్లో యువత అధికంగా సెల్‌ఫోన్లతో పాటు టీవీలకు పరిమితమయ్యారు. సిగ్నల్ రాకపోవడంతో కొంతమంది రామమందిరాలు చేరుకుని సెల్‌ఫోన్లలో క్రికెట్ మ్యాచ్‌ను వీక్షించారు. జిల్లా కేంద్రం పార్వతీపురంలోనూ క్రికెట్ అభిమానులు ఇళ్లకే పరిమితమయ్యారు. దీంతో ప్రధాన రహదారులు, కూడళ్లు నిర్మానుష్యంగా మారాయి. నిత్యం రద్దీగా ఉండే ఆర్టీసీ కాంప్లెక్స్, గూడ్స్‌షెడ్, నాలుగు రోడ్లు, పాతబస్టాండ్ కూడళ్లు జన సంచారం లేక బోసిపోయాయి. కాగా టీమిండియా విజయం సాధించడంతో పాలకొండ తదితర ప్రాంతాల్లో యువకులు, క్రికెట్ అభిమానులు జాతీయ జెండా చేతపట్టి పుర వీధుల్లో బాణసంచా కాల్చారు.



పార్వతీపురంలో జాతీయ జెండాతో యువత సందడి

ఇలా ఎలా?

- డేటా ఎంట్రీ ఆపరేటర్ ఖాతాలోకి పంచాయతీల నిధులు!
- చోద్యం చూస్తున్న అధికారులు



కొమరాడ, మార్చి 9(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల ప్రగతి కోసం ప్రభుత్వం ఏటా లక్షలాది రూపాయలను మంజూరు చేస్తుంది. వాటి ద్వారా పల్లెల్లో అభివృద్ధి పనులు చేపట్టిన వ్యక్తి పేరున (వెండర్ కోడ్) చెల్లింపులు జరుగుతాయి. అయితే కొమరాడ మండలంలో భిన్న పరిస్థితి నెలకొంది. కొన్ని గ్రామ పంచాయతీల్లోని నిధులు డేటా ఎంట్రీ ఆపరేటర్ వ్యక్తిగత ఖాతాకు మళ్లినట్లు తెలుస్తోంది. 2024-25లో 15వ ఆర్థిక సంఘం నిధులను డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేస్తున్న ఓ వ్యక్తి అకౌంట్‌లోకి జమైనట్లు సమాచారం. గ్రామ పంచాయతీల ఆర్థిక లావాదేవీలు, పారిశుధ్యం, ఇంటి పన్నుల వసూలు తదితర రికార్డులు, పనులు ఏ విధంగా సాగుతున్నాయన్నది పరిశీలించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడమే ఇందుకు కారణమనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. వాస్తవంగా గ్రామ పంచాయతీలలో అభివృద్ధి పనులు నిర్వహించే కాంట్రాక్టర్‌కు వెండర్ కోడ్ ఏర్పాటు చేసి బిల్లుకు సంబంధించిన నిధులను వారి అకౌంట్‌కు జమ చేయాల్సి ఉం టుంది. అయితే డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేస్తున్న వ్యక్తి పేరున గ్రామ పంచాయతీలలో నిధులు ఏ విధంగా వెళ్లాయన్నది ప్రశ్నార్థకంగా మారింది. మండలంలో అధిక శాతం మంది సర్పంచ్‌లు, కార్యదర్శుల డీఎస్‌కే (డిజి టల్ సంతకాలు)లు డేటా ఎంట్రీ ఆపరేటర్ వద్ద ఉండటం వల్ల నిధుల మళ్లింపు జరిగినట్లు కొంతమంది ఉద్యోగులు అందించిన సమాచారం ద్వారా తెలుస్తోంది. దీనిపై ఉన్నతస్థాయి అధికారులు విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని మండలవాసులు కోరుతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో మల్లికార్జునరావును వివరణ కోరగా.. తమ దృష్టికి కూడా నిధుల మళ్లింపు విషయం వచ్చిందన్నారు. పంచాయతీ రికార్డులను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కొండ శిఖర గ్రామాలకు గిరి బజార్

- గిరిజనుల చెంతకే నిత్యావసర సరుకులు
- ప్రత్యేక వాహనం సిద్ధం
- ఇక వారపు సంతలకు వెళ్లకుండా చర్యలు

పార్వతీపురం, మార్చి9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గిరి శిఖర గ్రామాల ప్రజల కష్టాలు తీరనున్నాయి. నిత్యావసర సరుకుల కోసం వారు ఇకపై కొండలు దిగి ఎక్కాల్సిన అవసరం లేకుండా జిల్లా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ మేరకు గిరిశిఖర గ్రామాలకే ప్రత్యేక వాహనంలో నిత్యావసరాలు తరలించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం 'గిరి బజార్' పేరిట ఓ వాహనాన్ని సిద్ధం చేశారు. త్వరలోనే ఈ సేవలు అందుబాటులోకి రానున్నాయి.

ఇదీ పరిస్థితి..

జిల్లాలో కొండ శిఖర గ్రామాల ప్రజలు వారికి కావాల్సిన నిత్యావసరాల కోసం వారపు సంతలకు చేరుకోవాల్సి వస్తోంది. ఇందుకోసం కిలోమీటర్ల మేర నడిచి.. కొండలు దిగి ఎక్కాల్సి వస్తోంది. అవసరమైన సరుకులను కొనుగోలు చేసుకుని తిరిగి స్వగ్రామానికి చేరుకోవడానికి ఎన్నో వ్యయప్రయాసలకు గురవుతున్నారు. ఇదే సమయంలో సంతల్లో మోసాలకు గురవుతున్నారు. కొంతమంది దళారులు, వ్యాపారుల కారణంగా నాణ్యత కలిగిన వస్తువులను పొందలేక పోతున్నారు. అయితే ఇటీవల వారపు సంతలను పరిశీలించిన కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఈ విషయాన్ని తెలుసుకున్నారు. ఈ మేరకు గిరిశిఖర గ్రామాల ప్రజల ఇక్కట్లు తొలగించాలనే ఉద్దేశంతో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పైలెట్ ప్రాజెక్టులో భాగంగా వారున్న చోటకే జీసీసీ ద్వారా నిత్యావసర సరుకులు అందించాలని సంకల్పించారు. ఇందులో భాగంగానే గిరి బజార్ అనే వాహనాన్ని సిద్ధం చేశారు. పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో 104 గ్రామాలకు గిరి బజార్ వాహనాన్ని పంపించి నిత్యావసరాలతో పాటు డీఆర్ డిపో సరుకులనూ అందజేయనున్నారు.



సాలూరు రూరల్: ఎగువ శింబి కొండ శిఖర గ్రామం



సరుకుల పంపిణీకి సిద్ధంగా ఉన్న గిరి బజార్ వాహనం

సర్వం సిద్ధం

కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆదేశాలతో గిరిజ బజార్ వాహనాన్ని సిద్ధం చేశాం. పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో సుమారు 104 గిరిజన గ్రామాల ప్రజలకు ఈ వాహనం ద్వారా నిత్యావసర సరుకులను అందిస్తాం. ఇకపై గిరి శిఖర గ్రామాల ప్రజలు వారపు సంతలకు వెళ్లాల్సిన అవసరం ఉండదు.

- ఉరిటి మహేంద్ర, జీసీసీ ఇన్‌చార్జి డివిజనల్ మేనేజర్

స్వయంగా తెలుసుకున్నా...

నిత్యావసర సరుకుల కోసం వారపు సంతలకు వచ్చే గిరిజనులతో మాట్లాడి వారి ఇక్కట్లు తెలుసుకున్నా. అందుకే గిరిజ బజార్ వాహనాన్ని సిద్ధం చేశాం. దాని ద్వారా వారికి సరుకులు అందిస్తాం. త్వరలోనే మంత్రి సంధ్యారాణి ఈ వాహన సేవలను ప్రారంభించనున్నారు.

-శ్యామ్ ప్రసాద్, కలెక్టర్

వైటీసీ ఆవరణలో
నీడ కరువాయే..



8లో

జూనిలోగా సీతానగరం వంతెన
పనులు పూర్తి చేస్తాం
● ఎమ్మెల్యే విజయచంద్ర

'శతర' ఆదివాసీ ఆత్మగౌరవానికి ప్రతీక

- సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్‌వీ రమణ

బెలగాం/గుమ్మలక్ష్మీపురం, మార్చి 9(ఆంధ్రజ్యోతి) : జిల్లాకు చెందిన కళింగాంధ్ర కవి, ఉపాధ్యాయుడు సిరికి స్వామినాయుడు రాసిన 'శతర' కవితా సంపుటి ఆదివాసీ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తుందని సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్‌వీ రమణ తెలిపారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం రాయ్‌పూర్‌లో తెలుగు మహా సంఘం నిర్వహిస్తున్న ద్వితీయ తెలుగు మహాసభల్లో ఆ కవితా సంపుటిని ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అడవి ఆకుల కళ్లతో మైదాన్ని చూస్తే.. మైదానం ఆకలి కళ్లతో అడవిని చూస్తోందన్నారు. 'శతర' కవితా సంపుటిని అద్భుతంగా రచించారని కొనియాడారు. ఈ ప్రతిష్ఠాత్మక సభలో సమన్వయ కర్తగా స్వామినాయుడు వ్యవహరించగా, ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్, ప్రముఖ నటుడు సాయి కుమార్, గజల్ గాయకుడు శ్రీనివాస్, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర రావు తదితరులు పాల్గొన్నారు.



కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న దృశ్యం

అ'పూర్వ' కలయిక
● 50 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు
8లో

పక్కాగా పీ-4 సర్వే

- తాగునీటి సమస్యలు తలెత్తరాదు
- కలెక్టర్ శ్యామ్ ప్రసాద్



పార్వతీపురం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పీ-4 సర్వేను పక్కాగా చేపట్టాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. ఆదివారం కలెక్టరేట్ నుంచి టెలికాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో మాట్లాడారు. జిల్లాలో రెండు లక్షల 65 వేల గృహాలు ఉండగా.. పక్కా ప్రణాళికతో రోజూ సర్వే చేయాలన్నారు. ఇప్పటికే శిక్షణ కార్యక్రమం నిర్వహించినందున ఎటువంటి అను మానాలకు తావు లేకుండా జాగ్రత్తగా ప్రక్రియను పూర్తిచేయాలని సూచించారు. గ్రామాల్లో ప్రజలు వారి ఉపాధి, వృత్తుల రీత్యా ఉదయమే బయటకు వెళ్లి సాయంత్రం తిరిగి ఇంటికి వచ్చే అవకాశం ఉన్నందున ఆయా వేళల్లో సర్వే చేయాలని తెలిపారు. ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ విధానాన్ని అమలు చేస్తుందన్నారు. పేదల జీవన ప్రమా ణాలు మెరుగుపర్చడానికి ఈ సర్వే ఎంతగానో దోహదపడు తుందని తెలిపారు. అందుకే ఒక్కొక్కరు రోజుకు కనీసం 90 వరకు సర్వే పూర్తి చేయాలన్నారు. జూన్ నెలాఖరు వరకు పురపాలక, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఇందుకు అవసరమైన చర్యలను ఇప్పటినుంచే తీసుకోవాలన్నారు. ప్రతి ఎంపీడీవో, కమిషనర్ పరిధిలో కొళాయిలు, బోర్లును క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో అవసరమైతే బోర్లు వేయాలని, మరమ్మతులు చేపట్టాలని స్పష్టం చేశారు. ప్రతి వారం విధిగా తాగునీటి పరీక్షలు జరిపి సురక్షిత నీటిని సరఫరా చేయాలన్నారు. స్వచ్ఛంద సంస్థలు, దాతల సహకారంతో ఎక్కడికక్కడే చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్లు, మండల ప్రత్యేకాధికారులు, ఎంపీడీవోలు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పాల్గొన్నారు.



సాలూరు-మక్కువ రహదారి ఇలా..

ఇకనైనా పూర్తయ్యేనా?

- సాలూరు-మక్కువ రోడ్డు నిర్మాణానికి చర్యలు
- గత వైసీపీ ప్రభుత్వ పాలనలో ముందుకు సాగని పనులు
- కూటమి ప్రభుత్వం పెండింగ్ బిల్లుల చెల్లింపు.. అయినా ముందుకు రాని కాంట్రాక్టర్
- అంచనా వ్యయం పెంచి ప్రతిపాదనలు పంపిన ఆర్అండ్‌బీ అధికారులు

సాలూరు, మార్చి9 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యానికి గురైన సాలూరు-మక్కువ రహదారికి మోక్షం కలిగేనా? రెండు మండలాల ప్రజల ఇక్కట్లు తొలగేనా? ఇంకెప్పటికి ఈ సమస్య పరిష్కారమవుతుందనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్న వేళ.. ఆర్అండ్‌బీ అధికారులు ఈ రోడ్డు నిర్మాణానికి తాజాగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. నిధులు మంజూరైన వెంటనే రోడ్డు నిర్మాణంతో పాటు విస్తరణ పనులు కూడా చేపట్టనున్నారు. ముందుగా సాలూరు- బాగువలస, చప్పబుచ్చంపేట-మక్కువ వరకు ఉన్న గుంతలను పూడ్చనున్నారు.

వాస్తవంగా గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎన్‌డీబీ ప్రాజెక్టులో భాగంగా సాలూరు-మక్కువ రహదారి విస్తరణకు రూ.55.56 కోట్లు మంజూరు చేశారు. అయితే సకాలంలో బిల్లులు చెల్లించలేదు. దీంతో రెండేళ్ల కిందట పనులు నిలిచిపోయాయి. కాగా ఈ మార్గంలో భారీ గోతులు ఏర్పడడంతో పట్టుమని కిలోమీటరు కూడా సాఫీగా రాకపోకలు సాగించలేని పరిస్థితి. మరోవైపు వాహనదారులు, ప్రయాణికులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. దీంతో శంబర మీదుగా మక్కువ చేరుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. వారి కష్టాలను పరిగణనలోకి తీసుకున్న కూటమి ప్రభుత్వం రూ.4.80 కోట్ల మేర బిల్లు బకాయిలు చెల్లించింది. అయితే పాత ఎస్ఎస్ఆర్ ధరల ప్రకారం మిగతా పనులు పూర్తి చేయలేమని కాంట్రాక్టర్లు తేల్చి చెప్పారు. ఈ నేపథ్యంలో రూ.5.20 కోట్లతో ఉన్నతాధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కాగా ఎన్‌డీబీ నిధులు వచ్చే పరిస్థితి లేకపోవడంతో కేంద్ర ప్రభుత్వం గిరిజన సంక్షేమ శాఖకు మంజూరు చేసే నిధులతో ఈ రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని అధికారులు భావిస్తున్నారు. ఒకవేళ అలా వీలుకాని పక్షంలో రాష్ట్ర ప్రభుత్వ నిధులతోనైనా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని తాజాగా ప్రతిపాదనలు పంపారు. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు ఏ మేరకు నిధులు మంజూరు చేసినా తక్షణమే పనులు మొదలు పెట్టి.. త్వరితగతిన రోడ్డు నిర్మాణం పూర్తయ్యేలా చూస్తామని అర్అండ్‌బీ జేఈ విజయకుమార్ తెలిపారు. సాలూరు నుంచి మక్కువ రహదారి నిర్మాణం విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి.. పనులు పూర్తయ్యేలా చూస్తామని మంత్రి సంధ్యారాణి వెల్లడించారు.

ఘనంగా అమ్మవారి మారు జాతర



చీపురుపల్లిలో కనకమహాలక్ష్మి దర్శనానికి వేచి ఉన్న భక్తులు

చీపురుపల్లి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో కనకమహాలక్ష్మి అమ్మవారి మారు జాతర ఆదివారం ఘనంగా జరిగింది. అమ్మవారి దర్శనం కోసం ఉదయం నుంచే భక్తులు క్యూలైన్‌లో నిరీక్షించారు. రూ.పది టికెట్ క్యూలైన్లు భక్తులతో నిండిపోయాయి. ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన చేశారు. దాదాపు నాలుగువేల మంది భక్తులు అన్న ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో బండ్లమూడి శ్రీనివాస్, కమిటీ చైర్మన్ గవిడి నాగరాజు, కెంబూరి సాయి తదితరులు పాల్గొన్నారు.

‘నగరం’లో ముత్యాలమ్మ తీర్థం



విజయనగరం రూరల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కొత్తపేట, కుమ్మరవీధిలో ముత్యాలమ్మ, పోతురాజుస్వామి తీర్థ మహోత్సవాలు ఆదివారం నేత్రోత్సవంతో ప్రారంభమయ్యాయి. కొత్తపేట, కుమ్మరవీధి, సాలివీధి, కురాకులగట్టు, సుద్ధవీధి తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ముత్యాలమ్మ, పోతురాజుస్వామిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రతినిధులు మద్దాల రామకృష్ణారావు, మద్దాల ముత్యాల ప్రకాశరావు ఆధ్వర్యంలో ఈనెల 13 వరకూ ఈ తీర్థ మహోత్సవాలు జరగనున్నాయి.

భోగాపురంలో ఎల్లమ్మ జాతర



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

భోగాపురం, మార్చి9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం భోగాపురంలో ఆదివారం ఎల్లమ్మ జాతరను ఘనంగా నిర్వహించారు. హనుమాన్ జంక్షన్ సమీపంలోని ఎల్లమ్మ ఆలయానికి భక్తులు ఉదయం నుంచే బారులు తీరారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం సాయంకాలం పూజారిని పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో యువత, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వెంకటాపురంలో విగ్రహ ప్రతిష్ఠోత్సవం



రామాలయంలో మంత్రి శ్రీనివాస్

దత్తిరాజేరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దత్తి వెంకటాపురంలో నిర్మించిన రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం అన్న సమారాధన చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు చప్ప చంద్రశేఖర్, నాయకులు బోడసింగి సత్తిబాబు, మిత్తిరెడ్డి ఈశ్వరరావు, బెజవాడ బంగారునాయుడు, వంగపండు కృష్ణమూర్తినాయుడు ఉన్నారు.

దుర్గమ్మకు పసుపు కుంకుమలు

కొత్తవలస, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవాడ-ముసిరాం గ్రామాల మధ్య రామలింగపురానికి చెందిన తోటలో దుర్గమ్మకు భక్తులు ఆదివారం పసుపుకుంకుమలు సమర్పించారు. దేవాడ, ముసిరాం, రామలింగాపురం, కోనమశివానిపాలెం గ్రామాల మహిళలు అమ్మవారిని దర్శించుకున్నారు. గతంలో దుర్గమ్మ గద్దెపై ఉండగా శనివారం గద్దెను తొలగించి నూతనంగా నిర్మాణం చేసిన ఆలయంలో దుర్గాదేవి విగ్రహానికి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఇకపై ఆలయంలో ఏర్పాటు చేసిన దుర్గమ్మకే పూజలు జరుగుతాయని కమిటీ ప్రతినిధులు తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

అచ్యుతాపురం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందాడని ఎస్ఐ సుధాకర్ తెలిపారు. ఎస్ఐ అందించిన వివరాలిలా ఉన్నాయి. విజయనగరం తోటపాలెంకి చెందిన గణేష్ (22) స్నేహితుడు సాయి హర్షవర్ధన్ అచ్యుతాపురం సెజ్‌లోని ఒక కర్మాగారంలో పనిచేస్తున్నాడు. తనతో పాటు తన స్నేహితుడు జస్వంత్‌కి కూడా అక్కడ ఏదైనా ఉపాధి చూడమని గణేష్ కోరాడు. ఇక్కడకి వస్తే ప్రయత్నిస్తానని చెప్పడంతో గణేష్, జస్వంత్ కలిసి అచ్యుతాపురం వచ్చారు. ముగ్గురు కలిసి అచ్యుతాపురంలో సాయి హర్షవర్ధన్ ఉంటున్న అద్దె ఇంట్లో ఉన్నారు. శనివారం రాత్రి గణేష్ మేడ మీద ఫోన్‌లో మాట్లాడుతుండగా పక్కనే మేడను అనుకొని ఉన్న విద్యుత్ వైర్లకు చేయి తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడని, కేసు నమోదు చేశామని ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

పోలీసుల అదుపులో అనుమానాస్పద వ్యక్తులు

దత్తిరాజేరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మానాపురంలో యాతవీధిలో శనివారం అర్ధరాత్రి గుర్తుతెలియని ఆరుగురు వ్యక్తులు హల్‌చల్ చేశారు. అనుమానాస్పదంగా రాత్రిపూట సంచరిస్తుండటంతో వీరిలో ముగ్గురిని స్థానికులకు పట్టుకున్నారు. వీరి వద్ద కేజీ గంజాయి ప్యాకెట్ లభ్యం కావడంతో వారిని పెదమానాపురం పోలీసు స్టేషన్‌కు అప్పగించారు. ఈ విషయమై ఎస్ఐ ఆర్.జయంతి వద్ద ప్రస్తావించగా ముగ్గురిని పట్టుకున్న విషయం వాస్తవమేనన్నారు. వారిని విచారిస్తున్నామన్నారు. మిగిలిన ముగ్గురి కోసం గాలిస్తున్నామన్నారు.

యువత పోరును జయప్రదం చేయండి



వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

విజయనగరం దాసన్నపేట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం విద్యార్థులకు ఫీజు బకాయిలు చెల్లింపులో జాప్యాన్ని నిరసిస్తూ ఈ నెల 12న యువత పోరు కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని వైసీపీ జిల్లా అధ్యక్షుడు, జడ్పీ చైర్‌పర్సన్ మజ్జి శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం ధర్మపురిలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన వెంటనే యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని, నిరుద్యోగ భృతిని ఇస్తామని చెప్పిన మాటను మరిచారన్నారు. ఈ నెల 12న వైసీపీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా నగరంలోని నెహ్రూ యువ కేంద్రం సమీపంలోని పార్కు నుంచి కలెక్టరేట్‌కు ర్యాలీ నిర్వహిస్తామన్నారు. అనంతరం కలెక్టరుకు వినతిపత్రం అందజేస్తామన్నారు. సమావేశంలో వైసీపీ నాయకులు నాయుడుబాబు, జైహింద్‌కుమార్, కేవీ సూర్యనారాయణరాజు, వర్రి నర్సింహమూర్తి, గదుల సత్యలత, బంగారునాయుడు తదితరులు పాల్గొన్నారు.

వీఆర్వోలకు మద్దతు ప్రకటన

వేపాడ, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం తీసుకున్న రేషనలైజేషన్ విధానానికి వ్యతిరేకంగా జిల్లాల్లోని గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం సభ్యులు చేస్తున్న ఉద్యమానికి వీఆర్ఏలు సంఘం మద్దతు ఉంటుందని రాష్ట్ర సంఘం అధ్యక్షుడు గబ్బు వెంకన్న తెలిపారు. ఆదివారం విజయనగరంలోని ఎన్జీవోల సంఘం సమావేశ భవనంలో వీఆర్వోల సంఘం జిల్లా అధ్యక్షుడు అప్పలనాయుడు, కార్యదర్శి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తీసుకున్న క్లస్టర్ విధానంలో రేషనలైజేషన్ పద్ధతిలో రెండు సచివాలయాలకు ఒక వీఆర్వోను నియమిస్తే రాష్ట్రం మొత్తం గా 7వేల 500 మంది ఉద్యోగుల జీవితాలు దెబ్బతింటాయన్నారు. ఈ పద్ధతి ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలన్నారు. లేకుంటే వీఆర్వోల సంఘం చేపట్టే పోరాటానికి వీఆర్ఏల సంఘం పూర్తి మద్దతు ఉంటుందని ప్రకటించారు.

రిటైర్డ్ ఉద్యోగుల సంఘం పటిష్ఠం కావాలి



మాట్లాడుతున్న సత్యం

మెరకముడిదాం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ ఉద్యోగుల సంఘం మరింత పటిష్ఠం కావాలని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పొట్నూరు సత్యం ఆకాంక్షించారు. మండలంలోని గర్భాం లో ఆదివారం వివిధ మండలాల రిటైర్డ్ ఉద్యోగులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైఫ్ సర్టిఫికెట్, రిటర్న్‌కు సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే మన కార్యాలయంలో సంప్రదించాలన్నారు. సమావేశంలో శింగవరపు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

20 వరకూ ప్రజా చైతన్యయాత్ర



చైతన్యయాత్రలో సీపీఎం నాయకులు

కొత్తవలస, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను తెలుసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రజా చైతన్య యాత్రలను సీపీఎం ఆధ్వర్యంలో శనివారం నుంచి 20 వరకు నిర్వహిస్తామని పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు గాడి అప్పారావు తెలిపారు. ఆదివారం ఆయన కొత్తవలస సిమెంట్ రోడ్డులో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు పీవీ రమణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

12న చలో విజయవాడ

కొత్తవలస, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ, వ్యవసాయ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 12న చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు జి.అప్పారావు తెలిపారు. ఇందుకు సంబంధించిన గోడ పత్రికను కొత్తవలసలో ఆయన ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి వేతనదారులకు అదనంగా మరో 100 రోజులు పని దినాలు కల్పించాలని, వేసవి అలవెన్స్‌లతో పాటు పెండింగ్ బకాయిలను చెల్లించాలన్నారు. పేద కుటుంబాలకు 3 సెంట్ల ఇంటి స్థలంతో పాటు ఇంటిని నిర్మాణం చేసుకునేందుకు రూ.6 లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

అంగన్‌వాడీలకు అవార్డులు



అంగన్‌వాడీలను సత్కరిస్తున్న కలెక్టర్

నెల్లిమర్ల, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని అలుగోలు అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్త కెల్ల భారతి, దన్నానపేట అంగన్‌వాడీ కేంద్ర సహాయకురాలు రేగాన రెడ్డమ్మలకు ఆదర్శ మహిళా అవార్డులు లభించాయి. విజయనగరంలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో వీరికి కలెక్టర్ అంబేడ్కర్ ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా భారతి, రెడ్డమ్మలను సీడీపీవో ప్రసన్న, నెల్లిమర్ల మండల సూపర్‌వైజర్లు ఉమ, ఆల్తి జ్యోతి, బొద్దల శారద, త్రినాథ తదితరులు అభినందించారు.

పారిశుధ్య కార్మికురాలికి సత్కారం

విజయనగరం క్రైం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో మహిళా దినోత్సవం సందర్భంగా స్టేషన్‌లో పారిశుధ్య కార్మికురాలు బి.ఆదిలక్ష్మిని ఆదివారం సీఐ సూరినాయుడు సత్కరించారు. కార్యక్రమంలో హెచ్‌సీ భాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.

నేటినుంచి యథావిధిగా పరిష్కార వేదిక

విజయనగరం కలెక్టరేట్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసిన నేపథ్యంలో ఇక ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తామని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో..

విజయనగరం క్రైం: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసిన నేపథ్యంలో యథావిధిగా జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కారవేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని ఎస్పీ వకుల్ జిందాల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినతులను ప్రజలు అందజేయవచ్చునని పేర్కొన్నారు.

269 యూనిట్లు మంజూరు

లక్కరపుకోట, మార్చి 9(ఆంధ్రజ్యోతి): కొత్తవలస వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో 5 మండలాలకు 269 వ్యవసాయ యాంత్రీకరణ యూనిట్లను ప్రభుత్వం మంజూరు చేసిందని ఏడీ ఎల్.విజయ తెలిపారు. ఆదివారం ఎల్.కోట ఏవో స్వాతితో కలిసి ఆదివారం ఎమ్మెల్యే లలితకుమారిని కలిసి యాంత్రీకరణ యూనిట్లపై నివేదిక అందజేశారు. స్ప్రేయర్లు, పవర్ స్ప్రేయర్లు, పైపులు, రోటావేటర్స్, పవర్ టిల్లర్స్ తదితర వస్తువులు మంజూరయ్యాయని త్వరలోనే రైతులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

ఘంటసాల చిత్ర ప్రదర్శన

విజయనగరం బాబామెట్ట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్‌సీఎస్ థియేటర్‌లో ఘంటసాల ది గ్రేట్ చిత్రాన్ని ఆదివారం ప్రదర్శించారు. మూడు రోజుల పాటు ఈ ప్రదర్శన ఉంటుంది. ఆదివారం ఉదయం జరిగిన ఈ ప్రదర్శనకు ప్రేక్షకులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఘంటసాల జీవితచరిత్ర ఆధారంగా సీహెచ్.రామారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సినిమా ప్రేక్షకులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో దవళ సర్వేశ్వరరావు, డైరెక్టరు రామారావు, ఎన్‌సీఎస్ థియేటర్ ఎండీ నారాయణం శ్రీనివాస్ తదితరులు హాజరయ్యారు.

బకాయిలు చెల్లించండి

విజయనగరం కలెక్టరేట్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు బకాయిలను వెంటనే చెల్లించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.చిరంజీవి కోరారు. ఇటీవల ఎమ్మెల్సీగా గాదె శ్రీనివాసులునాయుడు విజయానికి కృషి చేసిన ఏపీటీఎఫ్ కార్యకర్తలకు ఆదివారం స్థానిక పెన్షనర్ భవనంలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కారుణ్య నియామకాలు చేపట్టాలన్నారు. 2003 డీఎస్సీ వారికి పాత పింఛన్ విధానం అమలు చేయాలన్నారు. ఉమ్మడి సర్వీసు రూల్స్ అమలు, మున్సిపల్ యాజమాన్యానికి ప్రత్యేక సర్వీసు రూల్స్ ఏర్పాటు చేసి ప్రమోషన్లు కల్పించాలన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు హృదయరాజు, ఈశ్వరరావు పాల్గొన్నారు.

150 మందికి వైద్య పరీక్షలు

గుర్ల, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని కలవచర్లలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. దాదాపు 150 మంది రోగులు పరీక్షలు చేయించుకున్నారు. 10 మంది కంటి రోగులను పుష్పగిరి కంటి ఆసుపత్రికి తరలించారు. జనసేన నాయకుడు కూర్మారావు, సత్యనారాయణ, సంతోష్ తదితరుల ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటైంది. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ ఆసుపత్రి సిబ్బంది క్యాన్సర్ టెస్టులు నిర్వహించారు. కార్యక్రమంలో సేవాసమితి అధ్యక్షుడు గోపాలరావు, సర్పంచ్ ఎడ్ల గోపి, వైస్ సర్పంచ్ శ్రీనివాసరావు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

చర్చిలో దైవారాధన

విజయనగరం బాబామెట్ట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక స్విమ్స్ మెమోరియల్ బాప్టిస్ట్ చర్చిలో ఆదివారం దేవుడిని ప్రత్యేకంగా ఆరాధించారు. కార్యక్రమంలో పాస్టర్ ప్రభాకరరావు పాల్గొన్నారు. 40 రోజుల పాటు రోజూ రాత్రి 6.30 నుంచి 8.30 గంటల వరకు క్రీస్తు సందేశం ఉంటుందన్నారు. భక్తులు విజయవంతం చేయాలని ఆర్ఎస్ జాన్ కోరారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులను అందజేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

రాజాం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీడీపీ కార్యాలయంలో పలువురికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ ఆదివారం పంపిణీ చేశారు. రాజాం మున్సిపాలిటీ పరిధిలోని కస్పావీధికి చెందిన బొమ్మన కృష్ణారావుకు రూ.64 వేలు, రాజాంకు చెందిన శ్రీనుకు రూ.30 వేలు, రేగిడి మండలం అంబకండి గ్రామానికి చెందిన ఎలమంచి వెంకట్‌కు రూ.లక్ష, రేగిడి మండలం కోడిశకు చెందిన గురవాన సింహాంద్రికి రూ.99,485, రేగిడి మండలం రేగిడి గ్రామానికి చెందిన బొత్స బుచ్చినాయుడుకు రూ.32,100, రాజాం రూరల్ ఎం.జోగివలస గ్రామానికి చెందిన ఒక నెల బాలుడు అనారోగ్యానికి గురైన నేపథ్యంలో బాలుడు తల్లి అనురాధకు రూ.1,42,810, రేగిడి మండలం మునకవలస గ్రామానికి చెందిన గార వెంకటేశ్‌కు రూ.1.50 లక్షలు చెక్కులను వారు పంపిణీ చేశారు కార్యక్రమంలో కోళ్ల అప్పలనాయుడు, కోండ్రు జగదీశ్, కిమిడి అశోక్‌కుమార్, గురవాన నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

జనసేనలో పలువురు చేరిక



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే మాధవి

భోగాపురం, మార్చి9 (ఆంధ్రజ్యోతి): భోగాపురంలోని ఎస్సీ, బీసీ కాలనీలో ఆదివారం ఎమ్మెల్యే లోకం నాగమాధవి సమక్షంలో పలువురు జనసేనలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జనసేన పార్టీ సిద్ధాంతాలు, పవన్‌కల్యాణ్ ఆశయాలు, చేస్తున్న కార్యక్రమాలను చూసి ప్రజలు పార్టీలో చేరుతున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు కాకర్లపూడి శ్రీనివాసరాజు, పల్లంట్ల జగదీశ్, పల్ల రాంబాబు, పడాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయండి

విజయనగరం దాసన్నపేట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా పిఠాపురం నియోజకవర్గ పరిధిలోని చింతాడ గ్రామంలో 14న నిర్వహించనున్న జనసేన అవిర్భావ దినోత్సవ సభను అందరూ జయప్రదం చేయాలని ఎమ్మెల్యే లోకం మాధవి కోరారు. ఆదివారం నగరంలోని ఐఎంఏ హాల్‌లో ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి సమావేశంలో ఆమె మాట్లాడారు. 2024 ఎన్నికలు తరువాత జరుగుతున్న పార్టీ తొలి సభ అన్నారు. అధినేత పవన్‌కల్యాణ్ త్యాగం, ప్రజల కోసం పోరాటం ఫలితంగా అధికారంలోకి వచ్చామన్నారు. సభ విజయవంతం చేయడానికి కంట్రోల్ రూం ఏర్పాటు, 500 మంది నాయకులతో కమిటీలు ఏర్పాటు, 7 నియోజకవర్గాల పరిధిలో ఐదు పాయింట్ల నుంచి విజయోత్సవ ర్యాలీలు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో విజయనగరం నియోజకవర్గ నాయకుడు అవనాపు విక్రమ్, జనసేన నాయకులు మర్రాపు సురేష్, బంటుపల్లి వాసు, చనుమల్లు వెంకటరమణ, జానా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా అవిర్భావ దినోత్సవ పోస్టర్‌లను ఆమె ఆవిష్కరించారు.

పోస్టర్ ఆవిష్కరణ..



పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

లక్కవరపుకోట, మార్చి 9(ఆంధ్రజ్యోతి): ఎల్.కోట పార్టీ కార్యాలయంలో ఆదివారం జనసేన ఆవిర్భావ దినోత్సవం పోస్టర్‌ను నియోజకవర్గ సమన్వయకర్త ఒబ్బిని సత్యనారాయణ విడుదల చేశారు. ఈనెల 14న పిఠాపురం చిత్రాడలో జరగనున్న ఆవిర్భావ దినోత్సవానికి నియోజకవర్గం నుంచి కార్యకర్తలు హాజరుకావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల పార్టీ నేతలు ఫిరోజ్, రావాడ నాయుడు, పి.సంతోష్ తదితరులు హాజయ్యారు.

గెస్టు లెక్చరర్ల సమస్యలను పరిష్కరించండి



వినతిపత్రం అందజేస్తున్న గెస్ట్ లెక్చరర్లు

లక్కవరపుకోట, మార్చి 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్టు లెక్చరర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్‌కు ఆదివారం కిత్తన్నపేట గ్రామానికి చెందిన కిలారి గౌరినాయుడు వినతిపత్రం అందజేశారు. గెస్ట్ లెక్చరర్ల సమస్యలను పరిష్కరిస్తామని పవన్‌కల్యాణ్ గతంలో హామీ ఇచ్చినట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో గజపతినగరం మాజీ ఎమ్మెల్యే పడాల అరుణ, రాష్ట్ర నాయకురాలు పి.యశస్విని, సత్యనారాయణ పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయండి

నెల్లిమర్ల, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేటలో నిర్మించనున్న నవోదయ గ్రంథాలయ భవనానికి ఎంపీ ల్యాడ్స్ నుంచి నిధులు మంజూరు చేయాలని ఆ గ్రంథాలయ భవన నిర్మాణ కమిటీ ప్రతినిధులు ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడును కోరారు. ఆదివారం ఆయన్ని కలిసి సత్కరించారు. అనంతరం నిధులు మంజూరు చేయాలని ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధులు పోలుపోతు రామారావు, పసుమర్తి వెంకటరమణ, కొండపల్లి జయరామ్ తదితరులు నవోదయ గ్రంథాలయం కోసం ఎంపీకి వివరించారు. ఇందుకు ఎంపీ అప్పలనాయుడు సానుకూలంగా స్పందించారని కమిటీ ప్రతినిధులు తెలిపారు.

రామతీర్థంలో కల్యాణోత్సవం



కల్యాణం నిర్వహిసున్న అర్చకులు

నెల్లిమర్ల, మార్చి 9(ఆంధ్రజ్యోతి): రామతీర్థం రామస్వామి దేవస్థానంలో ఆదివారం స్వామివారికి పుష్పార్చన చేశారు. ఈ సందర్భంగా శ్రీరామచంద్రస్వామికి ప్రాతఃకాలార్చన, బాలభాగం అనంతరం యాగశాలలో సుందరకాండ హవనాలు నిర్వహించారు. అనంతరం శ్రీరామచంద్రస్వామికి కల్యాణోత్సవం జరిగింది. ఆలయంలో గత నెల 10న పునర్వసు నక్షత్రం సందర్భంగా ప్రారంభించిన శ్రీమద్రామాయణ పారాణం 27వ రోజు కూడా కొనసాగింది. ఆస్థాన మండపంలో ఉత్సవమూర్తులు వద్ద రామాయణంలో పట్టాభిషేకం ఘట్టం విన్నవించి స్వామికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి వై.శ్రీనివాసరావు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సేవ చేస్తా..



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గాదె

విజయనగరం దాసన్నపేట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): రాజకీయాలతో సంబంధం లేకుండా ఉపాధ్యాయులకు సేవ చేస్తానని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు అన్నారు. అదివారం నగరంలోని తోటపాలెంలో ప్రైవేట్ కళాశాలలో పీఆర్‌టీయూ ఎన్నికల ఫలితాలపై జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఆర్‌టీయూ, ఇతర సంఘాల సహకారంతో విజయం సాధించానన్నారు. ఉపాధ్యాయుల సమస్యలే అజెండాగా ముమ్మందుకు సాగుతానని, ఇందులో రాజకీయాలకు తావులేదన్నారు. ప్రభుత్వానికి, ఉపాధ్యాయులకు వారధిగా పనిచేస్తానన్నారు. సమావేశంలో పీఆర్‌టీయూ ప్రతినిధులు రవీంద్రనాయుడు, శ్రీనివాస్, రాంబాబు, బంకపల్లి శివప్రసాద్, రాంబాబు, శంకరనాయుడు, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

గుడుల నిర్మాణాలు పూర్తయ్యేదెన్నడో..?

- పండగలు, శుభకార్యాల సమయంలో దేవుళ్లను కొలిచేందుకు అవస్థలు
- పనులు పూర్తిచేయాలని ఆర్అండ్ఆర్ కాలనీవాసుల వినతి



అసంపూర్తిగా నిలిచిన గుడి నిర్మాణం

భోగాపురం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): గూడెపువలస ఆర్ఆర్ కాలనీలో గుడుల నిర్మాణం అసంపూర్తిగా నిలిచి ఉన్నాయి. ఎయిర్‌పోర్టు నిర్మాణం కోసం చేపట్టిన భూసేకరణలో గూడెపువలస పంచాయతీలో రెల్లిపేట గ్రామస్థులకు మరో చోట అధికారుల పునరావాసం కల్పించారు. అయితే రెల్లిపేటలోని అమ్మవార్లు, దేవుళ్ల గుడులను ఆర్ఆర్ కాలనీలో నిర్మిస్తామని అప్పట్లో ప్రభుత్వం హామీ ఇచ్చింది. అయితే నేటికీ గుడుల నిర్మాణాలు పూర్తిచేయలేదు. అన్నింటినీ అసంపూర్తిగానే విడిచిపెట్టేశారు. దాంతో పండగలు, శుభకార్యాల సమయంలో దేవుళ్లను కొలిచేందుకు ఇబ్బంది పడుతున్నారు. గూడెపువలస శివారు ఎయిర్‌పోర్టు ప్రహరీ సమీప మూడు గుళ్ల వద్దకు వెళ్లి స్థానికులు మొక్కులు తీర్చుకుంటున్నారు. ఇకనైనా గుడుల నిర్మాణాలు పూర్తి చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

పశువుల శాల దగ్ధం.. మూగజీవాల మృతి

జియ్యమ్మవలస, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పరజపాడు గ్రామంలో శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తి పశువుల శాలకు నిప్పంటించడంతో మూగజీవాలు సజీవ దహనమయ్యాయి. దీనిపై బాధితులు చినమేరంగి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుడు గుంట్రెడ్డి శివన్నాయుడు ఇచ్చిన వివరాల ప్రకారం.. శనివారం అర్ధరాత్రి సమయంలో ఎవరో గుర్తు తెలియని వ్యక్తి పశువుల శాలకు నిప్పంటించడంతో అందులో ఉన్న రెండు గొర్రెలు, 20 కోళ్లు అగ్నికి ఆహుతయ్యాయి. మంటలను ఆర్పే ప్రయత్నం చేసి మూగజీవాలను రక్షించాలని చూసినా ప్రయోజనం లేకపోయింది. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు చినమేరంగి పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ పి.అనీష్ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెస్టారెంట్ నిర్వాహకుడిపై దాడి

పార్వతీపురంటౌన్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ ప్రైవేటు రెస్టారెంటు నిర్వహిస్తున్న దుర్గ అనే వ్యక్తిపై కొంతమంది వ్యక్తులు దాడి చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్టు పట్టణ పోలీసు స్టేషన్ ఎస్‌ఐ గోవిందరావు ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం అర్ధరాత్రి రెస్టారెంట్ నిర్వహిస్తున్న సమయంలో నలుగురు యువకులు వచ్చారు. ఆహార పదార్థాలు బాగోలేదని దుర్భాషలాడు తూ దుర్గతో వివాదానికి దిగారు. ఈ వివాదం కొట్లాటకు దారి తీసింది. ఈ దాడిలో దుర్గ తీవ్రంగా గాయపడ్డాడు. ఆయన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టిడ్కో ఇళ్లను పూర్తి చేయండి

బొబ్బిలి రూరల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): టిడ్కో ఇళ్లను పూర్తి చేసి, లబ్ధిదారులకు పంపిణీ చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు పి.శంకరరావు డిమాండ్ చేశారు. రామన్నదొరవలస గ్రామ సమీపంలో నిర్మిస్తున్న టిడ్కో ఇళ్ల సముదాయాన్ని ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఇల్లు లేని పేదల కోసం గతంలో టీడీపీ హయాంలో టిడ్కో ఇళ్లను మంజూరు చేసిందని, తర్వాత వైసీపీ ప్రభుత్వం వీటిని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. లబ్ధిదారులతో డబ్బులు కట్టించుకుని, బ్యాంకు రుణాలు తీసుకుని నిర్మాణాలు పూర్తి చేయకపోవడంతో పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇల్లు అప్పగించకుండానే బ్యాంకర్లు రుణం చెల్లించాలని నోటీసులు జారీ చేయడం దారుణమన్నారు. ఇప్పటికైనా టిడ్కో ఇళ్ల సముదాయంలో మౌలిక సదుపాయాలు కల్పించి తక్షణమే లబ్ధిదారులకు అప్పగించాలని కోరారు. లేకపోతే లబ్ధిదారులతో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కన్వీనర్ ఎస్.గోపాలం, నాయకులు జి.శంకరరావు పాల్గొన్నారు.

ఆర్టీసీ సాలూరు డీఎంగా మూర్తి


బాధ్యతలు స్వీకరిస్తున్న మూర్తి

సాలూరు రూరల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ సాలూరు డిపో మేనేజర్‌గా బీఎస్‌ఎన్ మూర్తి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. సాలూరు డీఎం భాస్కరరెడ్డి కొద్దిరోజులు కిందట పదవీ విరమణ చేశారు. ఆయన స్థానంలో శ్రీకాకుళం జిల్లా టెక్కలి ఆర్టీసీ డిపోలో సీఐగా పనిచేస్తున్న బీఎస్‌ఎన్‌మూర్తికి పదోన్నతి కల్పిస్తూ ఇక్కడ పోస్టింగ్ ఇచ్చారు. ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరి సహకారంతో సాలూరు డిపోను లాభాల బాటలో నడపడానికి కృషి చేస్తానన్నారు. బాధ్యతలు స్వీకరించిన ఆయన్ని పీటీడీ కార్మిక అసోసియేషన్లు అభినందించాయి.

ఘనంగా శ్రీరామ దర్బార్ వార్షికోత్సవం

గుర్ల, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుజ్జంగివలస శ్రీరామ దర్బార్ ఆలయం వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడులు పాల్గొన్నారు. వారికి ఆలయ ధర్మకర్త అట్టాడ చిన్నమనాయుడు దంపతులు, పురోహితులు సాదరస్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ మూర్తులను పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో మండల నాయకులు కేవీ సూర్యనారాయణరాజు, సీర అప్పలనాయుడు, గ్రామ పెద్దలు రెడ్డి అప్పలనర్సయ్య, మురళీ, అట్టాడ అప్పలరాజు, లక్ష్మీనాయుడు, గొర్లె రామునాయుడు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి సత్కారం

సాలూరు రూరల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా విజయం సాధించి, సీఎం చంద్రబాబు ఆశీస్సులు తీసుకున్న గాదె శ్రీనివాసులునాయుడును టీడీపీ సాలూరు అధికార ప్రతినిధి అక్యాన తిరుపతిరావు ఆదివారం విజయనగరంలో మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఉపాధ్యాయులు సమస్యలను పరిష్కారంలో మరింత చొరవ చూపి వారి మన్ననలు పొందాలన్నారు.

వైభవంగా సిర్లిపోతన్న జాతర


తిరువీధిలో సిర్లిపోతన్నకు పూజలు చేస్తున్న భక్తులు

రామభద్రపురం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఏటా చిన్నమ్మతల్లి అమ్మవారి పండగ ముందురోజు నిర్వహించే సిర్లిపోతన్న జాతర మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని, పాము ఆకారంలో ఉన్న సిర్లిపోతన్నను పురవీధుల్లో తిప్పుతూ డబ్బులు, మేళతాళాలతో జాతరను నిర్వహించారు. ఎస్‌ఐ ప్రసాదరావు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

● వీరఘట్టం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): వీరఘట్టం పంచాయతీలో గత మూడు రోజుల నుంచి జరుగుతున్న సిర్లిపోతన్న, ఎల్లమ్మ జాతర ఆదివారంతో ముగిసింది. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఎస్‌ఐ జి.కళానిధి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

● కురుపాం: కురుపాంలో సిర్లిపోతన్న యాత్ర ఆదివారం ఘనంగా నిర్వహించారు. నెయ్యిల కులస్తులు ఆరాధ్య దైవంగా పూజిస్తున్న సిర్లిపోతన్న యాత్ర స్థానిక ఎంపీడీవో కార్యాలయం వెనుక భాగంలో గల సిర్లిపోతన్న గుడి వద్ద నిర్వహించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


కురుపాంలో పూజలు


పాలకొండ: యాత్రకు భారీగా తరలివచ్చిన భక్తులు

రోడ్డు లేక.. నడవలేక

● రహదారి సౌకర్యానికి నోచుకోని గిరిజనులు
● పట్టించుకోని అధికారులు, నాయకులు

బొబ్బిలి రూరల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): తమ గ్రామానికి రోడ్డు వేయండి సారూ.. అంటూ మోసూరువలస, కృపావలస గిరిజనులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. రహదారి లేక అక్కడి గిరిజనులు నానా అవస్థలు పడుతున్నారు. సకాలంలో వైద్యం అందక గర్భిణులు ప్రాణాలు కోల్పోయిన సందర్భాలు ఉన్నాయి. మండలంలోని మోసూరువలస, కృపావలస గిరిజన గ్రామాలకు వెళ్లేందుకు ఇప్పటికీ రహదారి లేదు. కాలినడకనే వెళ్లాల్సి వస్తుంది. తమ గ్రామానికి రోడ్డు వేయండి మహాప్రభో అని వేడుకున్నా.. అధికారులు, నాయకులు స్పందించడం లేదని గిరిజనులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.


మోసూరువలస గ్రామానికి కాలి నడకన వస్తున్న గిరిజన మహిళలు

వంతెన పనులు పూర్తి చేస్తాం

● ఎమ్మెల్యే విజయచంద్ర


వంతెన పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

సీతానగరం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): సువర్ణముఖి నదిపై వంతెన పనులను జూన్ నెలలోగా పూర్తి చేస్తామని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. సీతానగరంలోని సువర్ణముఖి నది వంతెన పనులను ఆయన ఆదివారం పరిశీలించారు. సైట్ ఇంజినీర్లతో మాట్లాడి వంతెన పనుల్లో రాజీ పడొద్దని సూచించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో గెడ్డలుప్పి పనులను పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే బూర్జ నుంచి చినంకలాం వెళ్లడానికి మధ్యలో సువర్ణముఖి నదిపై వంతెన ప్రతిపాదనలు పంపించామని అన్నారు. గత ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే పాత వంతెనపై మరమ్మతుల కోసం రూ.129 కోట్లు నిధులను దుర్వినియోగం చేసినట్లు ఆరోపించారు. బలిజిపేట మండలం నారాయణపురం వంతెన పనులు కూడా పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పెంట సత్యం నాయుడు, ప్రతినిధులు రౌతు వేణుగోపాల్‌నాయుడు, తేలు శేఖర్, తెంటు వెంకట అప్పలనాయుడు, పైలా నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

సబ్ స్టేషన్ నిర్మాణానికి సహకరించండి

పార్వతీపురం రూరల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి ప్రజలు పూర్తిస్థాయిలో సహకరించాలని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర కోరారు. టిడ్కో ఇళ్లకు విద్యుత్ సౌకర్యం కోసం అడ్డాపుశీల ప్రాంతంలో ప్రభుత్వం ట్రాన్స్‌ఫార్మర్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. అయితే ఈ ప్రాంతంలో తమ జీడితోటలు ఉన్న కారణంగా నష్టపోయే పరిస్థితి ఉంటుందని గిరిజనులు ఇటీవల ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళ్లారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే స్పందించి సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవతో కలిసి ఆదివారం ఆ ప్రాంతాన్ని సందర్శించారు. గిరిజనులకు పూర్తిస్థాయిలో న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. రెవెన్యూ అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి అందజేత


సీఎం సహాయ నిధి చెక్కును అందిస్తున్న ప్రభుత్వ విప్ జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): గుమ్మలక్ష్మీపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ఆదివారం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును అందించారు. జియమ్మవలస మండలం కన్నపుదొరవలస గ్రామానికి చెందిన ఈగల సత్యనారాయణ అనారోగ్యానికి గురి కావడంతో ఎమ్మెల్యే చొరవతో సీఎం సహాయ నిధి నుంచి రూ.63,727 మంజూరయ్యింది. ఈ చెక్కును ఆమె సత్యనారాయణ కుటుంబ సభ్యులకు అందించారు. పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

ప్రతిభ పాఠశాలలో ప్రవేశాలకు రాత పరీక్ష


పరీక్ష రాస్తున్న విద్యార్థులు

సీతంపేట రూరల్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ప్రతిభా పాఠశాల, కళాశాలలో ప్రవేశాలకు ఆదివారం ప్రవేశ పరీక్షలు నిర్వహించారు. స్థానిక గురుకుల బాలికల పాఠశాలలో నిర్వహించిన ఈ ప్రవేశ పరీక్షకు 8వ తరగతికి సంబంధించి 65 మందికి గాను 58 మంది విద్యార్థులు హాజరయ్యారు. అలాగే ఇంటర్ మొదటి ఏడాది ప్రవేశాలకు గాను 347 మంది విద్యార్థులకు 325 మంది హాజరై పరీక్ష రాశారు. ఈ పరీక్షలను చీఫ్ సూపరింటెండెంట్ డి.అరుణజ్యోతి, పరిశీలకులు డి.శ్రీరామూర్తి, ప్రిన్సిపాల్స్ పర్యవేక్షించారు.

సర్కిల్ పోలీస్‌స్టేషన్‌కు ఐదుగురు ట్రైనీ ఎస్‌ఐలు

జియ్యమ్మవలస, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో చినమేరంగి సర్కిల్ పోలీస్‌స్టేషన్‌కు ఐదుగురు ట్రైనీ ఎస్‌ఐలు ఆదివారం వచ్చి చేరారు. ఎస్పీ మాధవరెడ్డి ఉత్తర్వుల మేరకు నక్సలైట్ ప్రభావిత ప్రాంతాల్లో ఉన్న జియ్యమ్మవలస, చినమేరంగి పోలీస్‌స్టేషన్లలో వీరు విధులు నిర్వర్తించనున్నారు. చినమేరంగి పోలీస్‌స్టేషన్‌కు ఎం.అనిల్‌రెడ్డి, వి.మణికంఠేశ్వర్‌రెడ్డి, వై.జ్యోతి నియమించ బడగా, జియ్యమ్మవలస పోలీస్‌స్టేషన్‌కు వి.నారాయణ రెడ్డి, వి.ప్రదీప్‌లు నియమితులయ్యారు. ఇక నుంచి వీరు సీఐ టీవీ తిరుపతిరావు పర్యవేక్షణలో విధులు నిర్వర్తిస్తూ కమ్యూనిటీ పోలీసింగ్‌తో పాటు నేర నియంత్రణలో ప్రస్తుతం ఉన్న చినమేరంగి ఎస్‌ఐ పి.అనీష్ వద్ద కొంత తర్ఫీదు పొందనున్నారు. ట్రైనీ ఎస్‌ఐలను చినమేరంగి ఎస్‌ఐ అనీష్ ఆదివారం అభినందించారు.


ట్రైనీ ఎస్‌ఐలను అభినందిస్తున్న చినమేరంగి ఎస్‌ఐ అనీష్

జనసేన ఆవిర్భావ సభను విజయవంతం చేయాలి

మక్కువ, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో ఈనెల 14న నిర్వహిస్తున్న జనసేన పార్టీ ఆవిరావ దినోత్సవ సభను విజయవంతం చేయాలని జనసేన పార్టీ సాలూరు నియోజకవర్గ సమన్వయకర్త గేదెల రిషివర్ధన్ కోరారు. ఆదివారం మక్కువలో సాలూరు నియోజకవర్గం నాలుగు మండలాల నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని వేలాది మంది కార్యకర్తలు జనసేన ఆవిర్భావ సభకు విచ్చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం పోస్టర్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ సాలూరు, మెంటాడ మండలా అధ్యక్షులు శివకృష్ణ, రాజశేఖర్, మక్కువ మండల ఉపాధ్యక్షులు సుగుణేశ్వరరావు, తవిటిరాజు, జనసైనికులు పాల్గొన్నారు.


పోస్టర్ విడుదల చేస్తున్న దృశ్యం

ముగిసిన శివ పంచాక్షరి మంత్ర జపం

నెల్లిమర్ల, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): సారిపల్లిలో భ్రమరాంబిక మల్లికార్జునస్వామి దేవాలయంలో ఆదివారం సప్త సప్తాహ శివ పంచాక్షరి మహామంత్ర జపం ఘనంగా జరిగింది. ఈసందర్భంగా వేలాది మందికి అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విజయనగరానికి చెందిన నేత్ర వైద్యుడు మంచు కుమారస్వామి, టీడీపీ మండల కమిటీ అధ్యక్షుడు కడగల ఆనంద్‌కుమార్, జైత్ర కన్‌స్ట్రక్షన్ అధినేత ఆల్తి శ్రీనివాసరావు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 49 రోజుల పాటు శివ పంచాక్షరీ మహా మంత్ర జపం చేయడం గొప్ప విషయమన్నారు. ఈ తరహా కార్యక్రమాలు తరచూ నిర్వహించాలని, ఇందుకు తమ సహకారం ఉంటుందని వారు తెలిపారు. వీరికి ఆలయ కమిటీ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.


అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

వైటీసీ ఆవరణలో నీడ కరువాయే..

● పాడైన రూఫ్‌టాప్
● ఏళ్లు గడుస్తున్నా సరిచేయని వైనం
● ఇబ్బంది పడుతున్న యువత, గర్భిణులు

సీతంపేట రూరల్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏ పరిధిలో నిర్వహిస్తున్న వైటీసీ(యూత్ ట్రైనింగ్ సెంటర్) కేంద్రంలో నిలువ నీడ కరువయ్యింది. వైటీసీ భవన నిర్మాణం చేపట్టినప్పుడు ఆరుబయట వివిధ కార్యక్రమాలు నిర్వహించేందుకు రూఫ్‌టాప్‌ను ఏర్పాటుచేశారు. అయితే గత హుదూద్ తుఫాన్ ధాటికి ఈ రూఫ్‌పై ఉన్న ప్లాస్టిక్ రేకులు గాలికి ఎగిరిపోయాయి. ఏళ్లు గడుస్తున్నా ఐటీడీఏ అధికారులు పట్టించుకోకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ వైటీసీ కేంద్రంలో ఒక పక్క స్కిల్ కాలేజ్, మరో పక్క గర్భిణుల వసతిగృహాన్ని నిర్వహిస్తున్నారు. దీంతో పాటు వివిధ సమావేశాలు కూడా ఈ వైటీసీలోనే జరుగుతున్నాయి. అయితే వేసవితాపం అధికంగా ఉన్న నేపథ్యంలో పైన ఉన్న రూఫ్‌టాప్ పాడవ్వడంతో కేంద్రంలో బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. అంతేకాకుండా గర్భిణులు ఆరుబయటకు వచ్చేందుకు ఎండ వేడికి కాళ్లు కాలుతుండడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఐటీడీఏ అధికారులు స్పందించి రూఫ్‌టాప్‌ను సరిచేసి నీడ కల్పించాలని పలువురు కోరుతున్నారు. ● దీనిపై ఐటీడీఏ ఏవో సునీల్ దృష్టిని ప్రశ్నించగా.. ఆయన ఈవిధంగా స్పందించారు. వైటీసీ కేంద్రాన్ని పరిశీలించి సమస్య పరిష్కరిస్తామని చెప్పారు.


వైటీసీ ఆవరణలో పాడైన రూఫ్‌టాప్


తోటపల్లి ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు కలిసిన దృశ్యం

అ'పూర్వ' కలయిక

● 50 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు

గరుగుబిల్లి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తోటపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 1974-75 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం అదే పాఠశాల ఆవరణలో కలుసుకున్నారు. 50 ఏళ్ల కిందట విడిపోయిన వారంతా ఒకటవ్వడంతో గత జ్ఞాపకాలను పంచుకున్నా రు. విశ్రాంత ఉపాధ్యాయులు శంబంగి శివన్నాయుడు, గుణుపూరు సింహాచలంలను దుశ్శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఎస్‌బీఐ ఏజీఎం వాదుషా బ్రహ్మ, కె.పరమేశ్వరరావు, ఎస్.సత్యనారాయణ, ఆర్.సోమేశ్వరరావు, డాక్టర్ డి.పారినాయుడు, బి.సురేంద్రనాథ్ బెనర్జీ, బి.బాలబ్రహ్మం, రమేష్‌కుమార్ పట్నాయిక్, తదితరులు పాల్గొన్నారు.

బెల్లంఊట ధ్వంసం

సీతంపేట రూరల్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): పూతికవలస పంచాయతీ పరిధిలోని నెల్లిగండి గ్రామ సమీపంలో ఆదివారం చేసిన దాడుల్లో 1,500 లీటర్ల సారా ఊటలను గుర్తించి, ధ్వంసం చేశామని ఎస్‌ఐ వై.అమ్మన్నరావు తెలిపారు. గ్రామ సమీపంలోని కొండపై 20 ప్లాస్టిక్ క్యాన్లలో ఉంచిన బెల్లంఊటను ధ్వంసం చేసినట్లు చెప్పారు.

హెల్మెట్ ధరించండి

ప్రాణ రక్షణ కోసం ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్ ధరించాలని ట్రైనింగ్ ఎస్‌ఐ శిరీష సూచించారు. ఆదివారం సీతంపేట వారపు సంతలో ఆమె రహదారి భద్రతపై అవగాహన కల్పించారు.

న్యూస్ బాక్స్

ఆస్పత్రుల్లో ఉద్యోగాల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

సీతంపేట రూరల్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సెకెండరీ హెల్త్ ఆస్పత్రుల్లో కాంట్రాక్ట్, పొరుగు సేవల పద్ధతిలో ఉగ్యోగాల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సీతంపేట ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు ఆదివారం ఓ ప్రకటలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 10వ తేదీ నుంచి 15వ తేదీ సాయంత్రంలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. థియేటర్ అసిస్టెంట్ 2, ఆడియో మెట్రీషియన్ 1, ఎలక్ట్రీషియన్ 2, పిజియోథెరపిస్ట్ 1, జనరల్ డ్యూటీ అటెండర్ 22, ప్లంబర్ 1 పోస్టులు ఖాళీ ఉన్నాయని తెలిపారు. పూర్తి వివరాల కోసం డీసీహెచ్‌ఎస్ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. ఈ ఉద్యోగాలు ఏడాది కాలపరిమితికి మాత్రమే అని తెలిపారు. రిజర్వేషన్లు ప్రభుత్వ నిబంధనల ప్రకారం వర్తిస్తాయని పేర్కొన్నారు.

నేడు ఐటీడీఏలో పీజీఆర్‌ఎస్

సీతంపేట రూరల్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏ కార్యాలయంలోని ఎస్‌ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్టు ఇన్‌చార్జి పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గిరిజనులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

దాడితల్లి పండగ తేదీలు ఖరారు

బొబ్బిలి/రూరల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి మునిసిపాలిటీ పరిధి గొల్లపల్లి గ్రామంలో వెలసిన 12 గ్రామాల ఇలవేల్పు దాడితల్లి అమ్మవారు పండగను మే 4, 5, 6 తేదీల్లో జరిపించుటకు పెద్దలు నిర్ణయించారని ఆలయ ఉత్సవ కమిటీ సభ్యుడు మండల జనార్దనరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడారు. సోమవారం సాయంత్రం మున్సిపల్ చైర్మన్ ఎస్.వెంకట మురళీకృష్ణ ఆధ్వర్యంలో దాడితల్లి అమ్మవారిని ఆలయం నుంచి గ్రామంలోకి తీసుకు వస్తారని చెప్పారు.

నేటి నుంచి చిన్నమ్మతల్లి పండగ

రామభద్రపురం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): రామభద్రపురం చిన్నమ్మతల్లి అమ్మవారి పండగ సోమవారం ప్రారంభం కానుంది. మూడు రోజులపాటు నిర్వహించే ఈ పండగకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. తొలిరోజు సోమవారం తొలేళ్ల ఉత్సవం, మంగళవారం అమ్మవారి ఘటాల తిరువీధి, బుధవారం అంజిలి రథోత్సవం, అనుపోత్సవం నిర్వహించనున్నారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. సీఐ కె.నారాయణరావు, ఎస్‌ఐ ప్రసాదరావుల ఆధ్వర్యంలో 70 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

హెచ్‌ఐవీ బాధితులకు పౌష్టికాహారం

బొబ్బిలి/రూరల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలిలోని ఎన్జీవో హోంలో గల హెచ్‌ఐవీ బాధితులకు చైల్డ్‌ఫర్డ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ(విజయనగరం) ఆధ్వర్యంలో కారుణ్య ఫౌండేషన్ చైర్మన్ జేసీ రాజు ఆదివారం పౌష్టికాహారం అందజేశారు. అనంతరం మహిళా లింక్ వర్కర్స్‌కు సత్కరించారు.

వీరభద్రుని ప్రభ చెట్టుకు ఉపాసన పూజ

సాలూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): సాలూరు గ్రామదేవత అమ్మవారు శ్యామలాంబ ఉత్సవంలో భాగంగా పట్టణంలోని మెంటాడ వీధికి చెందిన ప్రజలు.. పప్పల గౌరీ తోటలో ఉన్న చెట్టుకు ఆదివారం ఉపాసన పూజా కార్యక్రమం నిర్వహించారు. పూజారి జాడ మహేష్ వీరభద్రుని ప్రభ చెట్టుకు తొలిపూజ చేశారు.

'చలో విజయవాడ'కు భగ్నం


అంగన్‌వాడీ కార్యకర్తలు, సీఐటీయూ నాయకులను అదుపులోకి తీసుకున్న దృశ్యం

కొమరాడ, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యల పరిష్కా రానికి చలో విజయవాడ కార్యక్రమానికి సీఐటీయూ పిలుపు నిచ్చింది. ఈ మేరకు కొమరాడ ప్రాజెక్టు పరిధిలో సీఐటీయూ నాయకుడు సాంబమూర్తి ఆధ్వర్యంలో ఆదివారం రాయగడ - గుంటూరు ఎక్స్‌ప్రెస్ రైలుకు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. విషయం తెలుసుకున్న కొమరాడ పోలీసులు విజయ వాడ వెళ్లే అంగన్‌వాడీ కార్యకర్తలను, సీఐటీయూ నాయకులు సాంబమూర్తిని అదుపులోకి తీసుకున్నారు.